క్లుప్తంగా

ఇంటి పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ రఘుబాబు తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ఈ నెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో మద్దిపాడు మండలంలోని 22 గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నులు, ఇతర పన్నుల వసూళ్ల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ తెలిపారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా తాము అన్ని రకాల పన్నులు తప్పనిసరిగా చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పనుల నిమిత్తం పగటివేళల్లో అందుబాటులో లేని ప్రజల సౌకర్యార్థం ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం ఈవోపీఆర్‌డీ కూడా పంచాయతీ కార్యదర్శితో పాటు గ్రామాల్లో పర్యటించి పన్నుల వసూళ్లకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా పంచాయతీ కార్యదర్శులు పన్ను కట్టడానికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఇంటి పన్నులు త్వరగా చెల్లించాలి...

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇంటి పన్నులు, కుళాయి పన్నులతో పాటు ఖాళీ స్థలాలపై పన్నులను కూడా సత్వరమే చెల్లించాలని కమిషనర్ రామకృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం, ఆదివారం కూడా మున్సిపల్ కార్యాలయంలో పన్నుల వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

బాలికోన్నత పాఠశాలలో తాగునీటి సమస్య

మార్కాపురం: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తాగునీటి సమస్య ఏర్పడింది. పాఠశాలలోని సుమారు 800 మంది విద్యార్థినులు మధ్యాహ్న భోజన సమయం, ఇంటర్వెల్‌లో మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వారం నుంచి తాగునీటి సమస్య వేధిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వేసవి కాలం కావడంతో ఇంటి నుంచి బాటిల్‌లో తెచ్చుకున్న నీరు కొద్దిసేపటికే అయిపోతున్నాయి. దీంతో తాగేందుకు నీరు లేక గొంతు ఎండుతోందని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని బాలికలు కోరుతున్నారు.



ఏపీఎన్‌జీవో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవంలో వివిధ రకాల వేషధారణల్లో మహిళా ఉద్యోగులు



ఆంధ్రకేసరి యూనివర్సిటీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ డాక్టర్ పుష్పలత, వీసీ, తదితరులు

ఓర్పు, సహనానికి పెట్టింది పేరు.. మహిళ

- ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఘనంగా ముందస్తు వేడుకలు

ఒంగోలు సిటీ: ఓర్పు, సహనానికి పెట్టింది పేరు.. మహిళ అని, అటువంటి మహిళలు ఎక్కడైతే పూజింపబడతారో.. అక్కడ దేవతలు వర్ధిల్లుతారని స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్‌రావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ మూర్తి, ప్రత్యేక అతిథిగా పాల్గొన్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఒంగోలు డీఐజీ డాక్టర్ పుష్పలత తదితరులు ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వీసీ మూర్తి మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధానంతరం బాధితులను, బాధిత కుటుంబాలను ఆదుకుంది ఆనాటి మహిళలే అని గుర్తు చేశారు. 1950వ సంవత్సరం తర్వాత మహిళలకు అన్ని రంగాల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు. స్త్రీలు సమానత్వం కోసం కృషి చేస్తున్నారని, నేటి సమాజంలో సగభాగమైన మహిళలను గౌరవించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అనే నినాదంతో మహిళలు విద్యలో ముందు వరుసలో ఉండేవారని, అయితే, నేడు ఇంటికి వెలుగు ఇల్లాలు అనే సామెత సమాజంలో గణనీయమైన ప్రాచుర్యాన్ని పొందిందని తెలిపారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఒంగోలు డీఐజీ డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ ఓర్పు, సహనం అనేవి మహిళలకు బాల్యంలోనే అమ్మ ద్వారా అలవరుతాయని తెలిపారు. సదరు అమ్మ కూడా స్త్రీ మూర్తి కావడం సంతోషించదగిన విషయమన్నారు. మారిన కాలానికి అనుగుణంగా మహిళలు కూడా విద్య, వైద్యం, పారిశ్రామికరంగాల్లో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. మరొక ప్రత్యేక అతిథిగా ఒంగోలుకు చెందిన ఆయుష్ విభాగం వైద్యురాలు డాక్టర్ భ్రమరాంబ పాల్గొనగా, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.నిర్మలామణి, సీడీసీ డీన్ ప్రొఫెసర్ సోమశేఖర, ఏసీఈ డాక్టర్ అంచుల భారతీదేవి, ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్, నాన్ కాన్ఫిడెన్షియల్ విభాగం పీజీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఎంఎడ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అమృతవల్లి, బోధన, బోధనేతర సిబ్బంది అధిక సంఖ్యలో హాజరయ్యారు. సమావేశం అనంతరం ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అతిథులుగా హాజరైన డాక్టర్ పుష్పలత, డాక్టర్ భ్రమరాంబతో పాటు యూనివర్సిటీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను ప్రత్యేకంగా సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

డీఎస్ కళాశాలలో...

ఒంగోలు నగరంలోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ కళ్యాణి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంఘమిత్ర హాస్పిటల్ డాక్టర్ దీప పాల్గొని మహిళలు ఆరోగ్యంగా ముందుకు వెళ్లాల్సిన ఆవశ్యకతను వివరించారు. సంఘమిత్ర హాస్పిటల్ డాక్టర్ నందిత విద్యార్థులకు సీపీఆర్ ప్రదర్శించి దాని ఉపయోగాలను వివరించారు. అంతర్గత నాణ్యత హామీ సెల్ కో ఆర్డినేటర్ పి.కుసుమకుమారి, మహిళా సాధికార విభాగ కో ఆర్డినేటర్ ఇందిర, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు కలిసి వృక్షశాస్త్ర విభాగాధిపతి దోలా అనంత లక్ష్మిని మహిళా దినోత్సవం సందర్భంగా సన్మానించారు.

ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఒంగోలులోని ఎన్‌జీఓ హోంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుంచాల కోటేశ్వరమ్మ అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత పాల్గొని మాట్లాడారు. మూడు రోజులుగా మహిళా ఉద్యోగులకు నిర్వహించిన ఆటలు, ఇతర పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప రవాణా శాఖాధికారి ఆర్.సుశీల, ఆయుష్ డిపార్ట్‌మెంటు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జి.పద్మజాతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిపాలనాధికారి గీతాలక్ష్మి, ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కే శరత్ బాబు, జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ పి.మాధవి, జిల్లా సహాధ్యక్షుడు ఎం.వేంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి కె.శివకుమార్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.ఏడుకొండలు, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి మంజేష్, కార్యదర్శి షేక్ మాగ్దుం షరీఫ్, ఉపాధ్యక్షురాలు రత్నరాణి, సంయుక్త కార్యదర్శి నారాయణమ్మ, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.



డీఎస్ కళాశాలలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

మార్కాపురానికి సీఎం.. తర్లుపాడు రోడ్డుకు మోక్షం!

తర్లుపాడు: సీఎం చంద్రబాబు శనివారం మార్కాపురం పర్యటనకు వస్తుండటంతో తర్లుపాడు రోడ్డుకు ఒక్కసారిగా మోక్షమొచ్చింది. మార్కాపురం పట్టణ శివారులోని తర్లుపాడు రోడ్డులో సభా ప్రాంగణం, హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. ఆ మార్గం గుండా సీఎం కాన్వాయ్ రావాల్సి ఉంది. అయితే ఈ రోడ్డు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, మరమ్మత్తులు చేయాలని కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడలేదు. సీఎం పర్యటన ఖరారు కాగానే ఆర్అండ్‌బీ అధికారులు ఆగమేఘాల మీద తారు, కంకర తెచ్చి బుల్డోజర్లతో రాత్రికి రాత్రే రోడ్డు వేశారు. శుక్రవారం ఉదయం ఈ రహదారిలో వెళ్లే ప్రజలు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. రాత్రిలేని కొత్త రోడ్డు ఉదయానికల్లా ఎలా వచ్చిందబ్బా అంటూ చర్చించుకున్నారు.



సీఎం పర్యటన నేపథ్యంలో ఇప్పుడు ఇలా..



మార్కాపురం-తర్లుపాడు రోడ్డు మొన్నటి వరకు అలా..

వెలిగొండ ప్రాజెక్టుపై కూటమికి చిత్తశుద్ధి లేదు



ప్రజా చైతన్యయాత్రల పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 24 మండలాలకు సాగునీరు, తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టును చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రకటించి అందుకు 4 వేల కోట్ల రూపాయలు అవసరం కాగా, కేవలం 359 కోట్ల రూపాయలే కేటాయించడం ఇందుకు నిదర్శనమన్నారు. ఇలాగే కేటాయిస్తూపోతే మరో పదేళ్లకైనా ప్రాజెక్టు పూర్తి కాదని స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాగా ప్రకటించి జిల్లా అభివృద్ధి కోసం 10 కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై 8 నుంచి 17వ తేదీ వరకు ప్రజా చైతన్య యాత్రలు చేయనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలలో జిల్లా ప్రజల సమస్యలను అధ్యయనం చేయడమే కాకుండా ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. వెలిగొండను సత్వరమే పూర్తి చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీ మార్కాపురం, కనిగిరి ఆర్డీవో కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రకేసరి యూనివర్సిటీకి 200 కోట్ల రూపాయలు అవసరం కాగా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం కోటి రూపాయలే కేటాయించిందని, పాలేపల్లి రిజర్వాయర్‌కు 7 కోట్లు అవసరం కాగా, 10 లక్షల రూపాయలు కేటాయించడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోందన్నారు. ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన పాలకపక్షానికి అభివృద్ధిలోనూ మభ్యపెట్టడం అలవాటుగా మారిందన్నారు. కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ సూపర్ సిక్స్‌ను అటకెక్కించారని చెప్పారు. ఉపాధి హామీలో ఏడాదికి 200 పనిదినాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వెలిగొండ ప్రాజెక్టును సీఎం సందర్శిస్తున్నారా..లేదా..?

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొనేందుకు నేడు మార్కాపురం వస్తున్న సీఎం చంద్రబాబు.. ప్రతిష్టాత్మకమైన వెలిగొండ ప్రాజెక్టును సందర్శిస్తున్నారా.. లేదా..? అనేది గందరగోళంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన వివరాలలో వెలిగొండ ప్రాజెక్టు సందర్శన లేదన్నారు. జిల్లాకు చెందిన రాష్ట్ర సాంఘిక శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాత్రం వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్‌ను ముఖ్యమంత్రి సందర్శిస్తున్నట్లు ప్రకటించడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి షెడ్యూల్ మార్పు చేయాలని డిమాండ్ చేశారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు, మెడికల్ కాలేజీ నిర్మాణం గురించి ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని కోరారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్, శ్రీకాళహస్తి రైల్వే లైను, ఒంగోలు ఎయిర్ పోర్ట్ గురించి కూడా ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి స్పందన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. జిల్లాలోని ఒంగోలు కార్పొరేషన్, మార్కాపురం, గిద్దలూరు, పొదిలి, చీమకుర్తి, దర్శి నగర పంచాయతీలకు సంబంధించి మంచినీటి పథకాలకు అతి తక్కువ నిధులు కేటాయించడం దారుణమన్నారు. పాలేటిపల్లి రిజర్వాయర్‌కు రూ.7 కోట్లు అవసరమైతే కేవలం రూ.10 లక్షలు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యేలు ప్రయత్నించాలని డిమాండ్ చేశారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు సిటీ: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలన్నారు. వారి కుటుంబ సభ్యుల కోసం కారుణ్య నియామకాల జీవో విడుదల చేయాలన్నారు. ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పూర్తి సర్వీస్ ఇవ్వాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే తెలుగు, సంస్కృత, హిందీ, పీఈటీలకు పదోన్నతి కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు కూడా అన్ని రకాల వసతులు కల్పించాలని కోరారు.





కొత్తపట్నం హైస్కూల్లో సత్కారం అందుకుంటున్న మహిళా ఉపాధ్యాయులు

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న డాక్టర్ చాపల శాంతకుమారి

ఒంగోలు టౌన్: కుటుంబంలోని మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ తర్వాతి మూడు తరాలు ఆరోగ్యంగా ఉంటారని ఒంగోలు నగరానికి చెందిన ప్రముఖ వైద్యురాలు చాపల శాంతికుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తూనే.. ఆరోగ్య పరిరక్షణ గురించి తగినంత శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి మహిళ తప్పనిసరిగా చదువుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, సీఐటీయూ, ఐద్వా నాయకులు కె.సామ్రాజ్యం, టి.విజయమ్మ, కళ్యాణి, ఏ రాజ్యలక్ష్మి, గోవిందమ్మ, వై.అంజమ్మ, రంగమ్మ, జ్యోతి, టి.మహేష్, జి.రమేష్, నరసింహ, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కౌమార దశ నుంచే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి...

బాలికలు కౌమార దశ నుంచే ఆరోగ్యంపై తగిన అవగాహన కల్పించుకుని కాపాడుకోవాలని ఒంగోలు జీజీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమయ్యఖాన్ సూచించారు. నగరంలోని పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో నాబార్డ్, ప్రేరణ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కౌమర దశ బాలికలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రతలను వివరించారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, దంత వైద్యురాలు డా.సాహితి, నాబార్డ్ డీపీఎం రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. స్కూలు హెచ్ఎం బి.లక్ష్మీప్రసన్న కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మహిళలు అన్ని రంగాల్లో సమానం...

కొత్తపట్నం: మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ఉన్నారని, ఇది మహిళలకు గర్వకారణమని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం మన్నం శ్రీదేవి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో శుక్రవారం మహిళా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్, ఫాస్ట్ వాకింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గణిత ఉపాధ్యాయుడు కృష్ణకుమార్ ఆధ్వర్యంలో మహిళలను శాలువాలతో సత్కరించారు. పాఠశాలలో సుమారు 16 మంది మహిళా ఉపాధ్యాయులు, నలుగురు స్వీపర్లు, నలుగురు మధ్యాహ్న భోజన కార్మికులకు సన్మానించారు. స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ సాయి కిషోర్, ఆంగ్లం ఉపాధ్యాయుడు శరత్ చంద్ర, నాగమల్లేశ్వరరావు, చెక్కా కోటేశ్వరరావు, శేషగిరిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాట ఫలితమే.. మహిళా దినోత్సవం...

సంతనూతలపాడు: మహిళల హక్కుల కోసం పోరాట ఫలితమే మహిళా దినోత్సవమని ఐద్వా మండల కార్యదర్శి ఎస్.మాలతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సంతనూతలపాడులోని అంబేడ్కర్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మాలతి పాల్గొని మాట్లాడారు. మహిళల్లో చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టి.నారాయణమ్మ, కే బుజ్జి, వెంకటేశ్వరమ్మ, పి.మల్లేశ్వరి, కే రోజమ్మ తదితరులు పాల్గొన్నారు







